కాంగ్రెస్ గెలిస్తేనే సమగ్ర అభివృద్ధి


స్థానికులతో మాట్లాడుతున్న శ్రీ గణేష్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆరో వార్డు తవాయిపురలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీరు, రోడ్లు, డ్రైనేజ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడానికి గత పాలకులే కారణం అని కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం బలవంత్ రెడ్డి, స్వరూప, చంద్రావతి, ధనలక్ష్మి, స్పందన, యూసుఫ్, ఫర్హాన, జ్యోతి, శాంతి, ఖాజా, ఆబిద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కంటోన్మెంట్: మారేడ్‌పల్లిలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు రేపాల వెంకటేశ్వర్లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బద్దం బల్వంత్ రెడ్డి, సామ్సన్ రాజు, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్ సోమవారం కార్డియల్ పూల ఆంథోనీ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. త్వరలో జరిగే కంటోన్మెంట్ ఎన్నికల్లో విజయం కలిగేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ థామస్, బంధాన్నాథం ఆరోగయ్య, పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులనే గెలిపించండి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఈటల రాజేందర్

కంటోన్మెంట్: కరోనా విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని దేశ ప్రజలను కాపాడడంలో ప్రధానమంత్రి మోదీ కీలకపాత్ర వహించారని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మోండా డివిజన్ పరిధిలో స్థానికులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని తొలి కరోనా కేసు కంటోన్మెంట్‌ని మహేంద్ర హిల్స్‌లో నమోదవ్వగా నాడు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా తాను కంటోన్మెంట్‌లో పర్యటించానని అన్నారు. కరోనా బారి నుంచి 80 కోట్ల మంది నిరుపేదలకు నేటికీ కేంద్ర ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోంది అన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నాటి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, గోపి, శంకర్, పిట్ల నాగేష్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న దృశ్యం

అడ్డగుట్ట: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పాఠశాల యాజమాన్య కమిటీ, తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యాశాఖ ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకై విద్యాశాఖ జారీ చేసిన జీవో నెం–5 ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం 2009లోని సెక్షన్ 21, 22 ద్వారా తల్లిదండ్రులకు పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించడం కోసం దేశంలోని ప్రతీ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటు కోసం చట్టం రూపం కల్పించిందని కానీ.. ప్రస్తుతం చట్టబద్ధంగా ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలనుకోవడం సరైనది కాదన్నారు. ఈ నిరసనలో వివిధ సంఘాల ప్రతినిధులు భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, గోపి, కౌసల్య, ప్రవీణ్, సమ్మయ్య, మోతిలాల్, శోభ, రామలీల, పుష్ప, సువర్ణ, భాగ్య, సౌజన్య, క్రాంతిరేఖ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: ప్రజల్లో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సోమవారం సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని వాసన్ ఐ బ్యాంకు ఆవరణలో వివిధ సంఘాల ప్రతినిధులు సమావేశాన్ని నిర్వహించారు. అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రమోషన్ ట్రస్టు, సదాశయ ఫౌండేషన్, తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్, జై భారత్ సమస్త సంస్థల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించి నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లో ఎలా అవగాహన కల్పించాలనే దానిపై చర్చించారు. రాష్ట్రంలోని గ్రామ స్థాయి నుంచి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు అవయవదానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయా సంఘాలు నిర్ణయించాయి. దీని కోసం సమిష్టిగా కృషి చేయాలని వారు తీర్మానం చేశారు. ప్రజల్లో వీటిపై అవగాహన లేకపోవడం మూలంగా చనిపోయిన వారి నేత్రాలు, అవయవాలు మట్టిలో కలిసిపోతున్నాయని సమయానికి అవయవాలు దొరకక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయాక మట్టిలో శరీరం కలిసిపోకుండా మరెంతో మందికి ప్రాణాలు ప్రసాదించేలా అందరూ ఆలోచించాలని సూచించారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం అన్ని సంఘాలు జేఏసీ లాగా ఏర్పడి ఉద్యమంలా దీన్ని ప్రజల్లో తీసుకుని వెళ్తామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన పాస్టర్లు


దీపక్‌జాన్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు, నాయకులు

లాలాపేట: తార్నాక, అడ్డగుట్ట డివిజన్ ప్రాంతాలకు చెందిన పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు సోమవారం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పాస్టర్లు ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సుదర్శన్, రెవరెండ్ సీహెచ్ జాకబ్, అజరయ్య మోజెస్, బాల్‌రాజు, రెవరెండ్ అరుణ్‌కుమార్, జోషఫ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



రసూల్‌పురా: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మహంకాళి అమ్మవారిని వేడుకున్నట్లు బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం కళాసిగూడలో మహంకాళీ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి నివేదితతో కలిసి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. జక్కుల మహేశ్వర్ రెడ్డి, లోక్‌నాథ్, పాండుయాదవ్, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, రవి కుమార్, డోలి రమేష్, మురళి రెడ్డి, విజయ్‌కుమార్, మురళీ మోహన్ పాల్గొన్నారు.

మృతదేహంతో ఊరేగింపు.. స్తంభించిన ట్రాఫిక్



అమీర్‌పేట: పాత కక్షల నేపథ్యంలో ప్రగతినగర్‌లో దారుణ హత్యకు గురైన తేజస్ అలియాస్ సిద్దు మృతదేహాన్ని ఎస్ఆర్‌నగర్‌లో ఊరేగించారు. దీంతో ఎస్ఆర్‌నగర్ నుంచి బల్కంపేట వైపు వెళ్లే రోడ్డు మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా యువకులు వినిపించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నేరుగా అమీర్‌పేటకు తీసుకువచ్చిన యువకులు ఎస్ఆర్‌నగర్, బీకేగూడ మీదుగా బల్కంపేట శ్మశానవాటిక వరకు డీసీఎం వాహనంపై మృతదేహంతో పాటు సిద్దు ఫొటోతో కూడిన కటౌట్‌ను పెట్టి పాలాభిషేకం చేస్తుండటంతో ఎక్కడికక్కడే వాహనాలు స్తంభించాయి.

లష్కర్‌లో ఎన్నికల ఏర్పాట్లకు కసరత్తు

సెక్టోరియల్ అధికారులకు శిక్షణ మరూ



సెక్టోరియల్ ఆఫీసర్ల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎన్నికల అధికారులు

సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ముందస్తు ఎన్నికల ఏర్పాట్లకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికల అధికారులు ఎస్. ఎల్లారెడ్డి, సుభాష్‌రావు నేతృత్వంలో సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గంలోని 220 పోలింగ్ బూత్‌లకు 23 మంది సెక్టోరియల్ అధికారులను నియమించి వారికి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు మౌలిక వసతులు కల్పించే దిశగా సెక్టోరియల్ అధికారులు తీసుకోవాల్సిన చర్యల గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రత్యేక అధికారి స్వర్ణలత, డిప్యూటీ తహసీల్దార్ భార్గవి, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి కే.భుజేందర్ బాబు పాల్గొన్నారు.

త్వరలో బీఎల్‌ఓల శిక్షణ

సెక్టోరియల్ అధికారులకు శిక్షణ తరగతులు పూర్తయిన వెంటనే బూత్‌లెవల్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సమాయత్తం అవుతున్నారు. కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే ఎన్నికల్లో నిర్వహించిన మాదిరిగానే ఈమారు కూడా నియోజకవర్గం మొత్తం మీద 220 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల వ్యవహారాలన్నీ ఓయూ ప్రాగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనం నుంచే కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ఇదే భవనంలో లోగడ రెండు మార్లు శాసనసభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సైతం ఇదే భవనాన్ని రిసెప్షన్ సెంటర్‌గా వినియోగించుకోవాలని నిర్ణయించారు.

రాష్ట్రస్థాయి సెల్‌ఫోన్ స్టేటస్ పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ టెలిఫోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న రాష్ట్రస్థాయి సెల్‌ఫోన్ స్టేటస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఇంజినీరింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ టి.రోహిత్ తెలిపారు. పోటీలో పాల్గొనే అభ్యర్థులు 9703258742 నంబర్‌ను సేవ్ చేసుకొని కాల్ చేయాలని, రేపటి నుంచి (10న) ఈ నెల 17 వరకు స్టేటస్‌లను పరిశీలించనున్నారు. స్టేటస్‌ల సంఖ్య ఆధారంగా బహుమతులకు ఎంపిక చేసి ఈ నెల 25న ఓయూలో జరిగే ప్రపంచ టెలిఫోన్ దినోత్సవంలో నగదు బహుమతులను అందజేస్తారన్నారు. మొదటి బహుమతి రూ.5000, ద్వితీయ రూ.3000, తృతీయ రూ.1500 నగదును అందచేయనున్నట్లు తెలిపారు. అశ్లీల, రాజకీయ, మత విమర్శలు లేని స్టేటస్‌లను పరిగణలోకి తీసుకుంటారన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం ప్రతి వ్యక్తి హక్కు



రాంగోపాల్‌పేట్: ప్రతివ్యక్తి సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండటమనేది వారి హక్కు అని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వెంకటి పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్యం అనే పదానికి అంగవైకల్యం లేకపోవడమే కాకుండా సంపూర్ణ శారీరక, సామాజిక స్వస్థతను కలిగి ఉండే స్థితిగా నిర్వచించిందని గుర్తు చేశారు. ఈ సంవత్సరం నినాదం నా ఆరోగ్యం–నా హక్కు అని నిర్ణయించిందని చెప్పారు. మనిషికి మంచి ఆరోగ్యం పొందే హక్కు ఉందని, కనీస ఆరోగ్య అవసరాలైన స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పోషకాలతో కూడిన ఆహారం అందాలన్నారు. ఈ ఆరోగ్య హక్కులకు భంగం కలిగించే ప్రత్యక్ష, పరోక్ష కారకాల నుంచి మానవుడికి స్వేచ్ఛ లభించినప్పుడే అతడికి ఆరోగ్య హక్కు సాకారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ శ్రీకళ, డిప్యూటీ డీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయాలి



రాంగోపాల్‌పేట్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్ ఆధ్వర్యంలో మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, స్థానిక పోలీసులు, సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కింగ్ దర్బార్, మోండా, ఆదయ్య నగర్, సిటీలైట్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటేయాలన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేసినా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా విద్యార్థులు, యువకులు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు వికాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. అధిక డబ్బు ఆశ చూపి పేద,మధ్య తరగతి వర్గాల విద్యార్థులు, యువకులే లక్ష్యంగా బెట్టింగ్‌లోకి లాగి అప్పుల పాలై చివరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బెట్టింగ్‌లకు ప్రేరేపించే వారి సమాచారాన్ని పోలీసులకు తెలుపాలన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు నుంచి జారిపడటంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 7న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 2వ ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరుతున్న ఫలక్‌నుమా రైలు జనరల్ బోగీ ఎక్కేందుకు అడ్డగుట్టకు చెందిన కే.శివ (45) ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు జారి ప్లాట్‌ఫామ్, రైలు బోగీ మధ్యన ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు బాధితుడిని రక్షించి చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రైలుకింద పడి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ జిల్లా బొల్లారం బజార్‌కు చెందిన ప్రభాకర్ కూలీగా పని చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై పనికి వెళ్లడం మానేశాడు. సోమవారం బొల్లారంబజార్ రైల్వేస్టేషన్ ఆఫ్‌లైన్ వద్దకు చేరుకుని వేగంగా వస్తున్న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కంటోన్మెంట్: రాజకీయ రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేస్తోందని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ అన్నారు. మే 13న రాష్ట్రంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఒకచోట కూడా మాదిగ అభ్యర్థికి టికెట్ ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపుమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్ మాదిగ, కొంపల్లి శ్రీకాంత్ మాదిగ పాల్గొన్నారు.

ఓయూలో నేడు రక్తదాన శిబిరం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నేడు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఉదయం 8 గంటలకు రక్తదాన శిబిరం జరగనుంది. ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే రక్తదాన శిబిరానికి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు ఓయూ అధ్యక్షులు మేడ శ్రీను తెలిపారు.

యూజీసీ న్యాక్ గుర్తింపు కోసం కసరత్తు

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ న్యాక్ గుర్తింపు కోసం కసరత్తు కొనసాగుతోందని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ తెలిపారు. గతంలో ఏడు సంవత్సరాలకు లభించిన యూజీసీ న్యాక్ ఏ–ప్లస్ గుర్తింపు గడువు ఈ ఏడాది ఆగస్టుతో ముగియనుంది. నాటి వీసీ ప్రొ.రాంచంద్రం హయాంలో 2017లో ఏడేళ్లకు యూజీసీ న్యాక్ ఏ–ప్లస్ గుర్తింపు లభించిన విషయం విదితమే. గడువు ముగింపునకు సమయం దగ్గర పడటంతో మరోమారు ఈ నెల చివరి వరకు దరఖాస్తు చేయనున్నట్లు వీసీ వివరించారు. అందుకు కావాల్సిన వివరాలను సేకరించి యూజీసీకి సమర్పించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అధ్యాపకుల కొరతతో ఈ సారి యూజీసీ గుర్తింపు కష్టతరమని సీనియర్ అధ్యాపకులు పేర్కొన్నారు.

అమావాస్య రోజు అన్నదానం శ్రేష్ఠమైంది


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నివేదిత

రసూల్‌పురా: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత అన్నారు. సోమవారం అమావాస్య పురస్కరించుకుని రసూల్‌పురా ఉషా గోదాం సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నివేదిత ప్రారంభించి మాట్లాడారు. అమావాస్య రోజు అన్నదానం చేయడం ఎంతో శ్రేష్ఠమైందని అన్నారు. ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, నిర్వాహకులు శ్యాంరెడ్డి, నర్సింహారెడ్డి సంగారెడ్డి, రవీందర్ రెడ్డి, విష్ణురెడ్డి, బీఆర్ఎస్ స్థానిక నేతలు అబ్జు, అంజనేయులు, ధన్‌రాజ్, కుమార్, శత్రు, శేఖర్, మధు, మురళి యాదవ్ పాల్గొన్నారు.

వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో..


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుంకు రాంచందర్

బౌద్ధనగర్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో బౌద్ధనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని సుంకు రాంచందర్ ప్రారంభించారు. రవి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.